క్లుప్తంగా

రూపాల సంగమేశ్వరుడిని దర్శించుకున్న కలెక్టర్



హారతి తీసుకుంటున్న కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు కల్చరల్: జగన్నాథ గట్టు రూపాల సంగమేశ్వరస్వామిని శనివారం జిల్లా కలెక్టర్ పి.రజింత్‌బాషా దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు అర్చకులు ఆశీర్వదించారు. కలెక్టర్‌తో పాటు ఆర్డీఓ సందీప్‌కుమార్, కర్నూలు, కల్లూరు తహసీల్దార్‌లు వెంకట రమేష్, ఆంజనేయలు ఉన్నారు. డీఎల్‌డీవో వెంకటరమణారెడ్డి, కర్నూలు ఎంపీడీవో జేమ్స్‌లు సైతం స్వామివారిని దర్శించుకున్నారు.

జిల్లాకు సంజీవయ్య పేరు పెట్టాలి



దామోదరం సంజీవయ్య పేరు జిల్లాకు పెట్టాలని ప్రదర్శన చేస్తున్న దృశ్యం

కర్నూలు(అర్బన్) : దామోదరం సంజీవయ్య పేరును ప్రభుత్వం కర్నూలు జిల్లాకు పెట్టాలని దామోదరం సంజీవయ్య జిల్లా సాధన సమితి గౌరవాధ్యక్షుడు నక్కలమిట్ట శ్రీనివాసులు డిమాండ్ చేశారు. దశాబ్దాలుగా కోరుతున్నందున ఈసారి ఖచ్చితంగా సంజీవయ్య పేరును జిల్లాకు పెట్టాలన్నారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక బిర్లా కాంపౌండ్ సమీపంలోని మహాత్మా పూలే విగ్రహానికి పూలమాల వేశారు. ఖానా ఖజానా, కొత్తబస్టాండ్ ప్రాంతాల్లో కరపత్రాలు పంచుతూ సంతకాల సేకరణ చేశామని తెలిపారు. కార్యక్రమంలో జీవీ కృష్ణయ్య, రామశేషయ్య, దామోదరం రాధాకృష్ణమూర్తి, నాగభూషణం, సీవీ వర్మ, ప్రేమ్ కుమార్‌రెడ్డి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



లలితా పీఠంలో ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి



సూర్యనారాయణస్వామి ఆలయంలో ..

కర్నూలు కల్చరల్: శ్రావణ శనివారం అమావాస్యను పురస్కరించుకొని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్యనారాయణ స్వామి ఆలయం, లలితాపీఠం, నగర శివారులోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. నవగ్రహ, లక్ష్మీ గణపతి, చండీ హోమం తదితరవి జరిగాయి. హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.

మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండండి

కర్నూలు(హాస్పిటల్): విద్యార్థులు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలని, వాటిని తదేకంగా గంటల తరబడి చూస్తే దృష్టి సమస్యలు వస్తాయని కంటి వైద్యులు డాక్టర్ పి. రాఘవప్రీతమ్ చెప్పారు. స్థానిక ఆర్‌టీసీ కాలనీలోని ది అధీనా స్కూల్‌లో శనివారం సుశీల నేత్రాలయ హాస్పిటల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు.

సాక్షి సినిమాలు



ఎస్‌వీసీ కాంప్లెక్స్ : కూలీ, వార్ 2, మహావతార్ నరసింహ, బన్ బటర్ జామ్, సు ఫ్రం సో, పరదా
వీ మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : కూలీ, వార్ 2, యూనివర్సిటీ (2023), మహావతార్ నరసింహ, మేఘాలు చెప్పిన ప్రేమకథ, స్టాలిన్ (2006)
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : బన్ బటర్ జామ్, వార్ 2, మహావతార్ నరసింహ
శ్రీరామ : కూలీ
రాజ్ : పరదా
భరత్ కాంప్లెక్స్ : మహావతార్ నరసింహ
విజయ : వార్ 2
విక్టరీ : హరిహర వీరమల్లు

ఆదర్శనీయులు ఆంధ్రకేసరి

● ఘనంగా టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి ● చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన పలువురు



ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పోలీసు అధికారులు,



టంగుటూరి జయంతి కార్యక్రమంలో జెడ్పీ అధికారులు, ఉద్యోగులు

కర్నూలు: దేశ ప్రజల కోసం నిరంతరం శ్రమించిన యోధుడు టంగుటూరు ప్రకాశం పంతులు అందరికీ ఆదర్శనీయుడని అడ్మిన్ అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా అన్నారు. దివంగత ఆంధ్ర రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, స్వాతంత్ర్య సమరయోధులైన టంగుటూరు ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా పూలమాల వేసి నివాళులర్పించారు. దేశం కోసం, రాష్ట్రం కోసం ప్రకాశం పంతులు చేసిన సేవలను కొనియాడారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనలో ఆయన నిర్ణయాత్మక పాత్ర పోషించారన్నారు. మద్రాసులో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో పాల్గొని ఆంధ్ర కేసరిగా చిరస్థాయిగా నిలిచారన్నారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీ భాస్కర్ రావు, ఆర్ఐలు జావిద్, నారాయణ, సోమశేఖర్ నాయక్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కర్నూలు సిటీ: ప్రతి విద్యార్థి ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు చరిత్ర తెలుసుకోవాలని ఆంధ్ర లయోలా కాలేజీ (విజయవాడ)వైస్ ప్రిన్సిపాల్, ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి డా.ముచ్చా శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. క్లస్టర్ వర్సిటీ కేవీఆర్ మహిళ డిగ్రీ కాలేజీ, సాహితీ సదస్సు ఆధ్వర్యంలో టంగుటూరు ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రకాశం పంతులు ఆనాడు రైతులు పడుతున్న ఇబ్బందులను చూసి జమీందారు వ్యవస్థను రద్దు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కేవీఆర్ కాలేజీ ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, సభాధ్యక్షులు కె.చంద్రశేఖర్ కల్కూర, అధ్యాపకులు అక్తర్ భాను, మానవశక్తి పరిశోధన కేంద్రం వ్యవస్థాపకులు డా.మన్సూర్ రెహమాన్, డీఎస్పీ మహబూబ్ బాషా, డి.పార్వతి ప్రసంగించారు. అధ్యాపకులు ఫామీదా, ఎ.జయలక్ష్మి, జి.రాధా రమణి, సునీత, సవిత, నూర్‌బాషా పాల్గొన్నారు.

గొప్ప ధీరుడు టంగుటూరి ప్రకాశం

కర్నూలు (అర్బన్) : బ్రిటీష్ గన్ పాయింట్‌కు ఎదురుగా తన ఛాతీ చూపించి నిలబడిన గొప్ప ధీరుడు టంగుటూరి ప్రకాశం పంతులు అని, అందుకే ఆయనను 'ఆంధ్ర కేసరి' అని పిలిచేవారని జెడ్పీ ఉప ముఖ్య కార్య నిర్వహణాధికారి ఈవీ సుబ్బారెడ్డి అన్నారు. శనివారం జిల్లా ప్రజా పరిషత్ మినీ సమావేశ భవనంలో ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులు న్యాయవాదిగా ఉన్నప్పుడు బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్వరాజ్ కోసం తన జీవన విధానాన్ని మార్చుకున్నారని తెలిపారు. ఆయన ధైర్యం, నిబద్ధత, త్యా గం ఉంటే ఏ ఆణచివేతనైనా ఎదుర్కొనగలమని తెలిపారు. కార్యక్రమంలో ఏఓలు మురళీమోహన్ రెడ్డి, బసవ శేఖర్, రాంగోపాల్, నాగేంద్ర ప్రసాద్, పుల్లయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో

కర్నూలు(సెంట్రల్) : స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీషు వారికి ముచ్చెమటలు పట్టించిన ఘనత టంగుటూరి ప్రకాశం పంతులుఉ దక్కుతుందని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలానీబాషా అభిప్రాయపడ్డారు. శనివారం పార్టీ కార్యాలయంలో ప్రకాశం పంతులు జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్‌బాబు, నాయకులు సయ్యద్ ఖాద్రిపాషా, అమన్, బజారన్న బతుకన్న, షేక్ ఖాజాహుస్సేన్ పాల్గొన్నారు.

మహిళా జైలు ఆకస్మిక తనిఖీ



మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి

కర్నూలు: నగరంలోని మహిళా కారాగారాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. శనివారం ఉదయం మహిళా జైలుకు చేరుకుని ఖైదీలకు అందించే ఆహారం, రేషన్, వారి ఆరోగ్యం గురించి తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. ఖైదీలకు న్యాయవాదులు లేకుంటే న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని తెలిపారు. 70 ఏళ్ల వయస్సు పైబడిన ఖైదీలకు, అనారోగ్యంతో బాధ పడేవారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామని, త్వరగా బెయిల్ మంజూరయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. ఖైదీలను కోర్టు వాయిదాలకు ఖచ్చితంగా హాజరుపరచాలని ఆదేశించారు. జైలు అధికారుల నుంచి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని మహిళా ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ న్యాయవాది సులోచనతో పాటు జైలు అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

దారంతా గుంతలమయం



గుంతలమయంగా లక్ష్మీపురం రోడ్డు

కల్లూరు: కల్లూరు అర్బన్ 28వ వార్డు పరిధి లక్ష్మీపురం గ్రామానికి వెళ్లే దారంత గుంతలమయంగా మారింది. 44వ జాతీయ రహదారి నుంచి హంద్రీనది బ్రిడ్జి వరకు గుంతల ఉండడంతో పాటు అక్కడక్కడ కంకర తెలింది. ఈ రోడ్డుపై నిత్యం లక్ష్మీపురం, దొడ్డిపాడు గ్రామాలకు చెందిన ప్రజలు, విద్యార్థులు, వివిధ పనుల నిమిత్తం కర్నూలుకు వెళ్లేవారు ప్రయాణిస్తుంటారు. రోడ్డుపై (ప్రయాణం నరకప్రాయంగా మారిందని ప్రయాణికులు, వాహనదారులు వాపోతున్నారు. 44వ జాతీయ రహదారి బస్టాప్ నుంచి లక్ష్మీపురం గ్రామానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఉంటుంది. లక్ష్మీపురం గ్రామానికి చెందిన రైతులు ఎద్దుల బండ్లు, వ్యవసాయ పనిముట్లతో గుంతలమయంగా మారిన రోడ్డుపై ప్రయాణించాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి కింద పడి గాయాలపాలయ్యే ప్రమాదం ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డు నిర్మించాలని ప్రయాణికులు, లక్ష్మీపురం గ్రామస్తులు కోరుతున్నారు.

జెడ్పీ శుభ్రతపై అధికారుల దృష్టి

సాక్షి ఎఫెక్ట్





జేసీబీ, కూలీల సాయంతో జెడ్పీ ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న దృశ్యం

కర్నూలు (అర్బన్) : జిల్లాపరిషత్ ప్రాంగణంలో ఏపుగా పెరిగిన గడ్డి, ఎక్కడ పడితే అక్కడ చెత్తాచెదారం, పనిచేయని మూత్ర శాలలు, పరిసరాల దుర్గంధం కనిపిస్తుంది. దీనికితోడు పాముల సంచారం పెరిగింది. ఈ సమస్యలపై ఈనెల 18న 'బుషలు కొడుతున్న ప్రమాదం' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై జిల్లాపరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, సీఈఓ జి.నాసరరెడ్డి స్పందించారు. జిల్లాపరిషత్ ప్రాంగణాన్ని శుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగానే శనివారం ఉదయం జేసీబీ సహాయంతో గడ్డి పెరిగిన వివిధ ప్రాంతాలను శుభ్రం చేయడంతో పాటు నిరుపయోగంగా ఉన్న మూత్రశాలలను కూడా కూలగొట్టారు. సాక్షి కథనంపై జెడ్పీ అధికారులు, పాలకవర్గం స్పందించి చర్యలు తీసుకోవడంపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కర్నూలును స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుదాం

కర్నూలు (టౌన్) : నగరాన్ని స్మార్ట్‌సిటీగా తీర్చిదిద్దుదామని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అన్నారు. శనివారం స్థానిక జమ్మిచెట్టు, సంకల్‌బాగ్, ఓల్డ్ పంప్ హౌస్ వద్ద ఉన్న మురుగు నీటి శుద్ధి కేంద్రాల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మురుగు నీటి శుద్ధి కేంద్రాల నిర్వహణను ప్రైవేటు సంస్థలకు అప్పగించే చర్యలు చేపట్టాలన్నారు. మరో ఎస్టీపీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. మునగాల పాడు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను పరిశీలించిన కమిషనర్ నగరపాలక సంస్థకు చెందిన 135 ఎకరాల భూమిని సర్వే చేసి రక్షణ వలయం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. స్మార్ట్‌సిటీలో భాగంగా 5 పార్కుల అభివృద్ధి, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు, ఓఆర్‌ఆర్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, ఎంఈ మనోహర్ రెడ్డి, డీఈఈ గిరిరాజు, నరేష్, గంగాధర్ పాల్గొన్నారు.

ఆస్తిపన్ను మదింపులో పొరపాట్లకు తావివ్వొద్దు

కర్నూలు (టౌన్): ఆస్తిపన్ను మదింపులో పొరపాట్లు జరిగితే ఉపేక్షించే పరిస్థితే లేదని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ హెచ్చరించారు. శనివారం సాయంత్రం స్థానిక నగరపాలకలోని తన చాంబర్‌లో రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రోజు రోజుకు పనితీరు మెరుగు పడాలన్నారు. విధి నిర్వహణలో మార్పు కనిపించాలన్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటించినప్పుడు తప్పులు కనబడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఆస్తిపన్నులు, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ల లీజులు, మొండి బకాయిలు వెంటనే రాబట్టాలన్నారు. డిమాండ్‌కు తగినట్లు పన్ను వసూళ్లు జరగకపోతే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ఆర్‌ఓలు జునీద్, ఇశ్రాయేలు, వాజిద్, ఆర్‌ఐలు పాల్గొన్నారు.



ఎస్టీపీల ఏర్పాటుపై ఇంజినీర్లకు సలహాలు, సూచనలు ఇస్తున్న కమిషనర్ విశ్వనాథ్

నేడు నగరంలో విద్యుత్ కోత

కర్నూలు(అగ్రికల్చర్): వినాయక చవితి, నిమజ్జనం కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకొని విద్యుత్ సబ్ స్టేషన్లు, లైన్‌లలో అభివృద్ధి పనులు చేపడుతున్నందున ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని కర్నూలు అర్బన్ డీఈఈ నాగప్రసాద్ తెలిపారు. పెద్ద మార్కెట్, సుబేదార్ స్ట్రీట్, ఉర్దూఘర్ ఏరియాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని శనివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు సర్వసభ్య సమావేశం

కర్నూలు (టౌన్) : ఈనెల 2 వ తేదీ అనివార్య కారణాలతో వాయిదా పడిన నగరపాలక సంస్థ పాలకవర్గ సర్వసభ్య సమావేశం తిరిగి ఈనెల 25న నిర్వహిస్తున్నట్లు నగరపాలక కమిషనర్ పి. విశ్వనాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటలకు స్థానిక ఎస్‌బీఐ కాలనీలో ఉన్న నూతన కౌన్సిల్ హాలులో ఈ సమావేశం జరుగుతుందన్నారు. గత సమావేశంలో చర్చించని అంశాలపై పాలకవర్గం ఈ సమావేశంలో చర్చించి తగు నిర్ణయాలు తీసుకుంటుందని ఆయన తెలిపారు.

15 మంది టౌన్ ప్లానింగ్ కార్యదర్శులకు మెమోలు

కర్నూలు (టౌన్) : నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగంలో పనిచేసే 15 మంది టౌన్ ప్లానింగ్ కార్యదర్శులకు నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ శనివారం మెమోలు జారీ చేశారు. భవన యజమానులు ఆన్‌లైన్‌లో బిల్డింగ్ అప్లికేషన్లు పెట్టుకొని 20 రోజులు గడుస్తున్నా ప్లానింగ్ కార్యదర్శులు పట్టించుకోలేదు. పెండింగ్ దరఖాస్తులపై ఈనెల 6వ తేదీన కమిషనర్ టౌన్ ప్లానింగ్ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అయినా ఇప్పటివరకు బిల్డింగ్ దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. దీంతో కమిషనర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ టౌన్ ప్లానింగ్ కార్యదర్శులు షేక్ అష్మద్ బాషా, ఎం.దివాకర్ నాయుడు, జి.మద్దయ్య, వి.రఘునాథ్ రెడ్డి, కె.నరేష్, బోయ పవన్ కుమార్, కె.ఉమాశంకర్ రెడ్డి, ఎస్.లక్ష్మీనరసింహ రాజు, పరంధాములు, శ్రీహరి కుమార్, బొబ్బల మౌనిక, పి.ఖాశీం, కె.సంజీవ కుమార్, శాంతి మధు, సి.స్వాతిలకు మెమోలు జారీ చేశారు. బిల్డింగ్ అప్లికేషన్లను ఎందుకు త్వరగాపరిష్కరించలేదో మూడు రోజు ల వ్యవధిలో తెలియజేయాలని, లేని పక్షంలో శాఖ పర చర్యలు తప్పవని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి

● సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు



మెడికల్ కాలేజీలో క్రిమిసంహారక మందును స్ప్రే చేయిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టినరసమ్మ

కర్నూలు(హాస్పిటల్): పెద్దాసుపత్రిలోని పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు చెప్పారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మాన్సూన్ హైజిన్ అనే నినాదంతో శనివారం ఆసుపత్రి ఆవరణలో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వర్షాకాలంలో దోమలు వృద్ధి చెందకుండా తగిన జాగ్రత్తలు, చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇందుకు సంబంధించిన శానిటేషన్, పెస్ట్ కంట్రోల్ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, ఇన్‌చార్జ్ సీఎస్‌ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, డిప్యూటీ సీఎస్‌ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు మెడికల్ కాలేజీలో...

కర్నూలు మెడికల్ కాలేజీలో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా శనివారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. వైద్యులు, ఉద్యోగులతో మాన్సూన్ పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్, కమ్యూనిటీ మెడిసిన్ హెచ్ఓడీ డాక్టర్ సుధాకుమారి, ప్రొఫెసర్ డాక్టర్ ఎలిజబెత్, ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారిణి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ప్రవీణ, డాక్టర్ ఉమామహేశ్వరి, డాక్టర్ హరీష్, డాక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో...

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ ఆధ్వర్యంలో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా శనివారం ప్రతిజ్ఞ చేయించారు. కార్యాలయ ఏఓ అరుణ, డీఐఓ డాక్టర్ వై. నాగప్రసాద్‌బాబు, డీపీఓ డాక్టర్ సంధ్యారెడ్డి, డెమో శ్రీనివాసులు శెట్టి, ఎస్ఓ హేమసుందరం తదితరులు పాల్గొన్నారు.

నేడు సన్మాన సభ

కర్నూలు (అర్బన్) : ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో కర్నూలు గిరిజన భవనంలో గిరిజన సలహా మండలి సభ్యుడు వెంకటపతికి సన్మాన సభ నిర్వహించనున్నట్లు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప అన్నారు. ఈ సభలో ప్రతి గిరిజనుడు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అనధికారికంగా రోడ్లను ఆక్రమిస్తే కఠిన చర్యలు



ఎన్టీఆర్ సర్కిల్ వద్ద తోపుడు బండ్లను తొలగిస్తున్న టౌన్‌ప్లానింగ్, ట్రాఫిక్ పోలీసులు

కర్నూలు (టౌన్): రోడ్లను ఆక్రమించి అనధికారికంగా స్టాళ్లు, బంకులు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ హెచ్చరించారు. శనివారం సాయంత్రం నగరంలోని వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు, టౌన్ ప్లానింగ్ సిబ్బందితో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అడ్డంగా ఉన్న బంకులు, హోర్డింగ్‌లు, బోర్డులు తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని రహదారులపై ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తున్న తోపుడు బండ్లు యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు. దీని వల్ల ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతుందని, ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. నగరాన్ని పరిశుభ్రంగా, క్రమబద్ధంగా ఉంచడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

25న చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండి



చలో కలెక్టరేట్ పోస్టర్లను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్) : విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 25వ తేదీన చేపట్టే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ పిలుపునిచ్చింది. శనివారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి రంగప్ప ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ..కూటమి ప్రభుత్వంలో విద్యాశాఖ తీరు దారుణంగా ఉందన్నారు. మంత్రిగా ముఖ్యమంత్రి తనయుడు నారా లోకేష్ ఉన్నా ఒక్క పని కావడం లేదన్నారు. వెంటనే పెండింగ్‌లోని 6,400 కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కోరారు. జీఓ నంబర్ 77ను రద్దు చేయాలని విన్నవిస్తున్నా పట్టించుకోవడంలేదన్నారు. హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలను రూ.3 వేలకు పెంచాలని కోరుతున్నా పట్టించుకోక పోవడంతో కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు అమర్, యోగి పాల్గొన్నారు.

కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స విజయవంతం

కర్నూలు(హాస్పిటల్): స్థానిక మెడికవర్ హాస్పిటల్‌లో ఇటీవల ఓ రోగికి నిర్వహించిన కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స విజయవంతమైనట్లు యురాలజిస్ట్ డాక్టర్ అబ్దుల్ సమద్, నెఫ్రాలజిస్టు డాక్టర్ సిద్దార్థ్ హెరూర్ చెప్పారు. శనివారం ఆ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఏడాదిగా కిడ్నీ సమస్యతో బాధ పడుతున్న ప్రొద్దుటూరుకు చెందిన ఆదినారాయణ కిడ్నీ మార్పిడి అవసరమని భావించి జీవన్‌దాన్‌లో పేరు రిజిస్టర్ చేయించామన్నారు. అలాగే కోయిలకుంట్ల మండలం పెద్దకొప్పర్ల గ్రామానికి చెందిన తెలుగు రామసుబ్బయ్య పనిచేస్తున్న సమయంలో కింద పడి తలకు బలమైన గాయం కావడంతో తమ ఆసుపత్రికి తీసుకొచ్చారని, 12వ తేదీన బ్రెయిన్‌డెడ్‌గా ప్రకటించగా అతన్ని బంధువులను కలిసి అవయవదానానికి ఒప్పించామన్నారు. మరుసటి రోజు ఆయన నుంచి సేకరించిన అవయవాల్లో ఒక కిడ్నీని ఆదినారాయణకు శస్త్రచికిత్స ద్వారా అమర్చామన్నారు. అతను ప్రస్తుతం పూర్తిగా కోలుకోవడంతో ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశామని తెలిపారు. సమావేశంలో హాస్పిటల్ క్లస్టర్ హెడ్ మహేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛత యజ్ఞంతో ఆరోగ్య సమాజానికి పునాది

కర్నూలు (టౌన్): నగర ప్రజలు స్వచ్ఛతను యజ్ఞంగా భావిస్తేనే ఆరోగ్య సమాజానికి బలమైన పునాదులు పడతాయని నగరపాలక సంస్థ కమిషనర్ పి. విశ్వనాథ్ స్పష్టం చేశారు. శనివారం స్థానిక డాక్టర్స్ కాలనీలో స్వచ్ఛంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులు, స్థానిక ప్రజలతో కమిషనర్ స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. అలాగే వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించే పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి విశ్వేశ్వర రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ వెనుక రాజకీయ కుట్ర



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్

కర్నూలు(సెంట్రల్): దళితుల ఐక్యతను దెబ్బతీసేందుకు ఎస్సీ వర్గీకరణ ద్వారా రాజకీయ కుట్ర చేశారని, ఇందులో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, చంద్రబాబునాయుడు ముఖ్యపాత్రలు పోషించారని నేషనల్ ప్రెసిడెంట్ ఫర్ రాక్స్ అండ్ మాలమహానాడు డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ విమర్శించారు. శనివారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఎస్సీ వర్గీకరణను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ వర్గీకరణతో దళితుల్లో బేధాభిప్రాయాలు వచ్చాయని, తద్వారా రాజకీయంగా వాడుకొని పేదలుగా ఉన్న వారిని మరింత పేదలుగా మార్చే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఈ విషయాన్ని ఎస్సీ కులాలు గ్రహించాలని సూచించారు. 1975లో మొదట ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ పంజాబ్‌లో బీజం వేసిందని, దానిని మోదీ 2025లో దేశం మొత్తం చేశారని విమర్శించారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, రేవంత్ రెడ్డి ఎస్సీ జాబితాలో ఉన్న 59 కులాలను రిజర్వేషన్ ఫలాలను ఎలా పంచుతారని ప్రశ్నించారు. రాజకీయాలు ఎలా ఉన్నా దళితులంతా ఐక్యమత్యంతో ఉంటే హక్కులు, అభివృద్ధిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీయవచ్చన్నారు. కార్యక్రమంలో నాయకులు మాల బాలముని, మునమ్మ, ధనుస్, గోవర్ధన్, అంజలి పాల్గొన్నారు.

ముందస్తుగా క్యాన్సర్‌ను గుర్తించేందుకు శిక్షణ



మాట్లాడుతున్న డాక్టర్ మహేశ్వర ప్రసాద్

కర్నూలు(హాస్పిటల్): రోగుల్లో క్యాన్సర్ అనుమానిత లక్షణాలను ముందస్తుగా గుర్తించేందుకే మెడికల్ ఆఫీసర్లకు శిక్షణ ఇస్తున్నట్లు రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ మహేశ్వర ప్రసాద్ చెప్పారు. కర్నూలు మెడికల్ కాలేజీలోని ఆడిటోరియంలో అసంక్రమిత వ్యాధుల ఎన్‌సీడీ 4.ఓ క్యాన్సర్ నివారణపై పట్టణ/ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే వైద్యాధికారులకు రెండోరోజు శిక్షణ ముగిసింది. ఈ సందర్భంగా డాక్టర్ మహేశ్వరప్రసాద్ మాట్లాడుతూ క్యాన్సర్ అనుమానిత లక్షణాలు ఉన్న వారిని గుర్తించి స్టేట్ క్యాన్సర్ ఆసుపత్రికి ప్రతి మంగళ, గురువారాల్లో నిర్వహించే ఓపీ నెంబర్ 222కు పంపాలని వైద్యులకు సూచించారు. అసంక్రమిత వ్యాధులతోనే అధికంగా మరణాలు సంభవిస్తున్నాయని, 30 ఏళ్లు దాటిన వారిలో బీపీ, షుగర్ వంటి సమస్యలు వస్తున్నాయని, మహిళల్లో క్యాన్సర్ ముప్పు అధికంగా ఉందని తెలిపారు. అసంక్రమిత వ్యాధులు సంక్రమించిన వారు ఆరోగ్యంగా కనిపిస్తున్నా శరీరం లోపల గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, నేత్రాలు వంటి కీలక అవయవాల పనితీరు మందగిస్తుందన్నారు. సకాలంలో గుర్తించకపోతే జీవితాంతం తీవ్ర సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్పారు. శరీరంలో ఎక్కడైనా పుండు ఏర్పడి అది తగ్గకపోవడం, పుట్టుమచ్చలు రంగు మారడం, పరిమాణంలో మార్పులు, మల, మూత్ర సమయాల్లో మార్పులు, రక్తం పడటం, విరేచనం నల్లగా మారడం, మింగడం కష్టంగా అనిపించడం, అరుగుదల సరిగ్గా లేకపోవడం, మహిళల్లో అసాధారణ రక్తస్రావం, తెలుపు అధికంగా కావడం, శరీరంలో ఏ భాగంలోనైనా వాపు, గడ్డలు రావడం, బరువు తగ్గడం, రక్తహీనత, గొంతు బొంగురు పోవడం, ఎడతెగని దగ్గు వంటి లక్షణాలు ఉంటే అది క్యాన్సర్ కావచ్చని చెప్పారు. ఇలాంటి వారు వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సంచార చికిత్స కార్యక్రమ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్, ఆర్‌కేఎస్‌కే కన్సల్టెంట్ మల్లికార్జున, ఫైనాన్స్ కన్సల్టెంట్ అరుణ, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.